

చిత్తూరు మీదుగా వందేభారత్

● విజయవాడ - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ముహూర్తం ఖరారు

డిసెంబరు 10నుంచి ప్రారంభం



చిత్తూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మీదుగా వందేభారత్ రైలు పరుగులు తీయనుంది. ఇప్పటికే విజయవాడ నుంచి చెన్నైకి వందే భారత్ ఉండగా, తాజాగా.. విజయవాడ - బెంగళూరు మార్గంలోనూ దీన్ని నడిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు.ఈ రైలుకు సంబంధించి ప్రతిపాదనలు మే నెలలో సిద్ధమయ్యాయి.ఈ రైలు ద్వారా విజయవాడ నుంచి బెంగళూరుకు 9 గంటల్లోనే చేరుకునే అవకాశం ఉండగా, చిత్తూరు నుంచి బెంగళూరుకు 3.11 గంటల్లో, విజయవాడకు 5.56 గంటల్లో చేరుకోవచ్చు. మొత్తం 8 బోగీల్లో.. 7 ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉంటాయి.డిసెంబరు 10 నుంచి మంగళవారం మినహా అన్ని రోజుల్లో ఇది ప్రయాణిస్తుంది. విజయవాడలో తెల్లవారుజామున 5.15 గంటలకు బయల్దేరి తెనాలి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా 10.27 గంటలకు చిత్తూరు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి కాట్పాడి జంక్షన్, కేఆర్‌పురం మీదుగా బెంగుళూరు (ఎస్ఎంవీటీ)కి మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుతుంది.తిరిగి ఈ రైలు బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి చిత్తూరుకు సాయంత్రం 5.49 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి రాత్రి 11.45 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది.చిత్తూరు జిల్లావాసులకు పొరుగునే ఉన్న బెంగుళూరుతో మంచి అనుబంధం ఉంది.వేలమంది యువకులు ఉద్యోగాలు చేసుకుంటుండగా, చాలామంది అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరంతా వారానికోసారి చిత్తూరు వస్తూ పోతూ ఉంటారు. అలాగే జిల్లా నుంచి మన రాజధానికి వెళ్లేవారూ ఎక్కువే. వీరందరితో పాటు విజయవాడ, బెంగళూరు నుంచి తిరుమల వెళ్లే భక్తులకు కూడా ఈ రైలు బాగా ఉపయోగపడనుంది.

'రైతన్నా మీ కోసం' ప్రారంభం



రైతుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్,చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే చిత్తూరు రూరల్ మండలం లోని పెరుమాళ్లకండ్రిగ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ నగదు రెండు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులకు పనిముట్లు, గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు వివరించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి రైతులతో ఆప్యాయంగా పలకరించారు. అన్నదాత సుఖీభవ డబ్బులు పడ్డాయా? అని ఆరా తీశారు. వ్యవసాయానికి కరెంటు సక్రమంగా వస్తోందా? వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉన్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను, ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని రైతులకు అందించారు. అనంతరం ఆదే గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ద్రౌపదీదేవి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల ట్రాక్టరు బోల్తా



ప్రమాదంలో తిరగబడ్డ ట్రాక్టరు ఇంజన్

● ఇద్దరు కూలీల దుర్మరణం

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటుకలను తరలిస్తున్న ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో మహిళ తీవ్రగాయాలతో స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.కార్వేటినగరం ట్రైనీ ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.... పుత్తూరు నుంచి ఓ ట్రాక్టరు ఇటుకలను లోడు చేసుకుని కార్వేటినగరం వస్తుండగా సురేంద్రనగరం కనుమ సమీపంలో చిత్తూరు జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై వున్న పుత్తూరులోని పిళ్లారిపట్టురోడ్డు వీధికి చెందిన టి.సంతోష్(21), కొత్తతిమ్మాపురానికి చెందిన ఎం.సెల్వి (50) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. తీవ్రంగా గాయపడిన పాతపల్లూరుకు చెందిన ఎం.రాధ(43)ను చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని రమేష్ తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టరు డ్రైవర్ మణి పరారైనట్లు తెలిపారు. ట్రాక్టరు రోడ్డుకు అడ్డంగా బోల్తా పడడంతో రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది.



తీవ్రంగా గాయపడ్డ రాధ - సంతోష్ మృతదేహం



మృతురాలు సెల్వి (ఫైల్ ఫొటో)

ప్రభుత్వాస్పత్రి వద్ద మళ్లీ పార్కింగ్ ఫీజు

● నిర్ణీత ధర కన్నా అదనంగా రూ.ఐదు చొప్పున వసూలు

చిత్తూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మళ్లీ పార్కింగు ఫీజు వసూలు చేస్తున్నారు.బైకుకు రూ.5, ఆటోకు రూ.15. కారుకు రూ.20 చొప్పున వసూలు చేసుకునేందుకు ఆస్పత్రి వర్గాలు కాంట్రాక్టు ఇచ్చాయి. అయితే బైకుకు రూ.10, ఆటోకు రూ20. కారుకు రూ.25 లెక్కన వసూలు చేస్తున్నారు. ఇదేమని ఆస్పత్రి వర్గాలు ప్రశ్నించకపోవడంతో వసూళ్లపర్వం యధేచ్ఛగా కొనసాగుతోంది.



పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది

కాణిపాక ఆలయ ట్రస్టు బోర్డు జీవో విడుదల



సురేంద్ర నాయుడు - చంద్రశేఖర రెడ్డి - ఊట్ల నాగరాజునాయుడు

ఐరాల(కాణిపాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ట్రస్టు బోర్డుకు 17మంది సభ్యుల పేర్లతో రాష్ట్రప్రభుత్వం సోమవారం సాయంత్రం జీవో విడుదల చేసింది. వీరిలో సురేంద్రనాయుడు(మణినాయుడు), చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ బీవీ నరేష్, పరిమి చంద్రకళ, కేఎస్ అన సూయమ్మ, కత్తి సుధాకర రెడ్డి, సంధ్యారాణి దేవరకొండ, సునీత గుంతుపల్లె, కొత్తపల్లె శివప్రసాద్, టీవీ రాజ్యలక్ష్మి, ఊట్ల నాగరాజు నాయుడు, శ్రీపతి సతీష్, పెరుమాళ్ల సుబ్బారెడ్డి, చల్లా కృష్ణవేణి, పి.పద్మలత కనక రాజు, వసంత, శ్రీవాణివున్నారు. వీరందరు త్వరలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.అనంతరం సురేంద్రనాయుడిని ఆలయ చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. అలాగే ఆలయంలో సీనియర్ ప్రధాన అర్చకుడిని ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఎన్నుకోనున్నారు.

ప్రేమ వివాహానికి అంగీకరించలేదని ఆత్మహత్య



గౌతమి(ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):కుటుంబ పెద్దలు ప్రేమ వివాహానికి అంగికరించలేదని ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు ....చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ నగిరిమిట్టపల్లెకు చెందిన గౌతమి(23) బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది.కందూరుకు చెందిన కార్తీక్‌తో ప్రేమలో పడింది. కులాలు వేరు కావడంతో ఇరు కుటుంబాల పెద్దలు వివాహానికి అంగీకరించ లేదు. దీంతో మనస్తాపానికి గురైన గౌతమి ఆదివారం రాత్రి ఇంటి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.గౌతమి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడే పంచమి తీర్థం

● మధ్యాహ్నం 12.10 గంటలకు చక్రస్నానం
● రోజంతా పంచమి ప్రభావం ఉంటుందన్న టీటీడీ
● తిరుచానూరుకు భారీగా చేరుకున్న భక్తులు
● నేటి రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్న బ్రహ్మోత్సవాలు





అశ్వ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుచానూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థం (చక్రస్నానం) మంగళవారం జరగనుంది. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వార్‌ను ఆలయం నుంచి వేంచేపుగా పంచమితీర్థం మండపానికి తీసుకురానున్నారు. పది గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.10 గంటలకు.. అభిజిత్ కుంభ లగ్నంలో చక్రత్తాళ్వార్‌ను అర్చకులు పుష్కరిణిలో మునక వేయించనున్నారు. ఆ తర్వాత భక్తులు పుష్కరిణి స్నానాలను ఆచరించనున్నారు. లక్ష మందికిపైగా భక్తులు పుష్కర స్నానం చేయనున్నారు. తదనుగుణంగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. చక్రస్నానం జరిగే ప్రాంతంలో స్టీల్‌తో గ్రిల్స్ అమర్చారు. వీవీఐపీలకు, వీఐపీలకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. చక్రస్నానానికి వచ్చే భక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్లను టీటీడీ అందించనుంది. రోజంతా పంచమి ప్రభావం ఉంటుందని, భక్తులు సంయమనంతో పుష్కర స్నానం ఆచరించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం రాత్రి జరిగే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

హోల్డింగ్ పాయింట్‌కొస్తేనే పుష్కరిణికి..

తిరుపతి నుంచి వచ్చే వారికి నవజీవన్ ఆస్పత్రి వద్ద. పూడి నుంచి వచ్చేవారికి స్వర్ణముఖినది ఒడ్డున గోశాల వద్ద. మరొకటి జడ్పీ హైస్కూల్ వద్ద హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ హోల్డింగ్ పాయింట్ల నుంచే పుష్కరిణి స్నానాలకు అనుమతిస్తారు. ప్రతి హోల్డింగ్ పాయింట్ నుంచి వచ్చే క్యూలైన్లను గేట్ నెంబరు 4కు అనుసంధానం చేశారు. అక్కడ్నుంచి పుష్కరిణిలోకి భక్తులను వదులుతారు. కాగా, సోమవారం రాత్రికే భక్తులు భారీ ఎత్తున హోల్డింగ్ పాయింట్లకు చేరుకున్నారు. వీరిని మంగళవారం ఉదయం 10గంటలకుపైగా పుష్కరిణి లోకి అనుమతించనున్నారు.

పార్కింగ్ కేంద్రాలు :పంచమి తీర్థానికి వచ్చే భక్తులకు శిల్పారామం, మార్కెట్‌యార్డు, తనపల్లి రోడ్డు, నారాయణాద్రి ఆస్పతి రోడ్డు, ముండ్లపూడి వద్ద పార్కింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. భక్తులు తమ వాహనాలను అక్కడ ఆపి హోల్డింగ్ పాయింట్లకు చేరుకోవాలి. ఇక సోమవారం రాత్రి 10గంటల నుంచి మంగళవారం సాయంత్రం వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించడం లేదు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
మధ్యాహ్నం 12.10 గంటలు:
పద్మసరోవరంలో చక్రస్నానం
రాత్రి 9.30 గంటలు:
ధ్వజావరోహణం

పుష్కరిణి చుట్టూ పటిష్ఠ నిఘా

పంచమితీర్థం సందర్భంగా దాదాపు రెండు వేల మందితో పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. పుష్కరిణి, ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆలయం, పుష్కరణి పరిసరాలను పరిశీలించడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వైర్‌లెస్ సెట్ ద్వారా పోలీసులను అప్రమత్తం చేస్తారు.

అశ్వ వాహనంపై కల్కిగా..

చెర్నాకోలు చేతపట్టి.. అశ్వ వాహనంపై కల్కి రూపంలో పద్మావతీ దేవి భక్తులను కటాక్షించారు.తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. దీంతో ఈనెల 17న రాత్రి చిన్నశేషుడితో మొదలైన అమ్మవారి వాహన సేవలు ముగిశాయి. గడిచిన ఎనిమిది రోజుల్లో 16 వాహనాలపై వివిధ రూపాల్లో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్,బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకిదేవి, శాంతారాం, నరేష్‌కుమార్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం రాత్రే హోల్డింగ్ పాయింట్‌కు చేరుకున్న భక్తులు

17 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా విజయపురంలో 20.2, సదుంలో 11.2, పెద్దపంజాణిలో 10.6, సోమల, రొంపిచెర్లలో 8.6, కార్వేటినగరంలో 8.2, నింద్ర, పుంగనూరు మండలాల్లో 7.2, ఐరాలలో 7.0, శ్రీరంగరాజపురంలో 4.6, రామకుప్పంలో 4.2, తవణంపల్లెలో 4.0, గంగవరంలో 3.6, పులిచెర్లలో 2.6, చౌడేపల్లిలో 2.2, గుడిపాలలో 1.0 మిమీ వర్షపాతం నమోదైంది.

టెన్త్ పబ్లిక్ పరీక్షల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): 2026 మార్చిలో నిర్వహించే టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ సమర్పించే అంశాలపై వచ్చే సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో డీఈవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూడైస్‌కు సంబంధించిన టెక్నికల్ సమస్యల పరిష్కారానికి ఏఎస్‌వో ఆనందుడును సంప్రదించాలని తెలిపారు. పరీక్ష ఫీజు ఇతర చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వ పరీక్షల విభాగం ఏసీ బి.అరుణ కుమార్ - 98666 50815, సూపరింటెండెంట్ జి.స్వర్ణకుమారి - 83282 16165, సీనియర్ అసిస్టెంట్ పి.సలార్‌ఖాన్ - 94931 43522, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎం.లక్ష్మి - 63021 64703 నంబరులో సంప్రదించాలని వివరించారు.

రేపు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జారీచేసిన ఉత్తర్వులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి అందాయి. బుధవారం ఉదయం 11 గంటల నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. రాజ్యాంగ దినోత్సవం అంశంపై వక్తృత్వ, సెమినార్, క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్, రాజ్యాంగ నిర్మాణంపై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

దివ్యాంగులకు రేపు చిత్తూరులో క్రీడా పోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న స్థానిక మెసానికల్ మైదానంలో డీఎస్ఏ ఆధ్వర్యంలో దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. షటిల్ బాడ్మింటన్ పోటీలో పాల్గొనే వారు 12 నుంచి 21 సంవత్సరాలు మధ్య బాలబాలికలు అర్హులని వివరించారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, 100మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, వీల్ చైర్ షాట్‌పుట్, అలాగే చెస్ పోటీలకు అన్ని వయసుల వారు అర్హులన్నారు. 26న ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన కారు


ప్రమాదానికి గురైన కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ కారు బోల్తాపడింది. తమిళనాడుకు చెందిన కుటుంబం దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణం కాగా మాల్వాడి గుండంకు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ముగ్గురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రూ.20 లక్షల వినికిడి యంత్రాలు



టీటీడీకి రూ.20 లక్షల విలువైన 105 వినికిడి యంత్రాలు సోమవారం విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన ఎన్ విరాట్ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు వీటిని అందజేశారు. శ్రవణం ప్రాజెక్ట్‌లో శిక్షణ పూర్తిచేసుకుని బయటకు వెళ్లే పిల్లలకు ఈ వినికిడి యంత్రాలను అందజేస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,974
తలనీలాలు సమర్పించినవారు: 28,995



మహారథంపై బ్రహ్మాండనాయకి







ముత్యపు కవచపు అలంకారంలో.. సర్వస్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి అమ్మవారు మహారథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. రథబలి కైంకర్యం నిర్వహించాక ఉత్సవమూర్తిని వేంచేపుగా రథమండపానికి తీసుకొచ్చారు. ఉదయం 9.15గంటలకు ధనుర్లగ్నంలో ముత్యపుకవచంతో ప్రసన్నమూర్తిగా అమ్మవారు రథంపై కొలువు దీరి భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో రథం ముందుకుసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఇక, రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రథ మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. - తిరుచానూరు, ఆంధ్రజ్యోతి






పుష్కరిణి వద్ద ఏర్పాట్ల పరిశీలన



తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో మంగళవారం పంచమి తీర్థం జరగనుంది. ఈ నేపథ్యంలో జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు సోమవారం అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు పరిశీలించారు. చక్ర స్నానం సందర్భంగా ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా భద్రతా చర్యల్లో పాల్గొంటాయన్నారు. అంతకు ముందు శిల్పారామంలో బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. భక్తులతో మర్యాదగా మెలగాలని, చిన్న సంఘటన జరిగినా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు ధ్వజావరోహణం, రేపు పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి బంగారు తిరుచ్చిపై అమ్మవారు తిరువీధుల్లో విహరిస్తారు. అనంతరం పాంచరాత్ర ఆగమశాస్త్రోక్తంగా ధ్వజ స్తంభంపై ఉన్న గజచిత్రపటాన్ని అర్చకులు అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. భక్తులు టిక్కెట్లు కొని పాల్గొనవచ్చు.

నేడు బంగారు చీరలో అమ్మవారి దర్శనం

పంచమితీర్థం సందర్భంగా అమ్మవారు మంగళవారం బంగారు చీరలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12 ఏళ్ల కిందట రూ.3 కోట్ల విలువ చేసే ఈ బంగారు పట్టుచీరను గుంటూరుకు చెందిన ఓ దాత సమర్పించారు. అప్పటి నుంచి బంగారు చీరను అమ్మవారికి కడుతున్నారు.

నేడు అమ్మవారికి అయ్యవారి సారె

తిరుమల/తిరుచానూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): పంచమితీర్థం సందర్భంగా తిరుమల శ్రీవారి తరపున మంగళవారం అమ్మవారికి సారె పంపనున్నారు. శ్రీవారి ఆలయం నుంచి వేకువజామున పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణాలతో కూడి సారెను ఆలయ నాలుగు మాడవీధుల గుండా ఊరేగిస్తారు. ఈ సారెతో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏకాంగులు, అర్చకులు, పరిచారకులు కాలిమార్గాన అలిపిరికి చేరుకుంటారు. అక్కడ వారికి అమ్మవారి ప్రతినిధిగా తిరుపతి జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారిపై ఊరేగింపుగా కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండు, లక్ష్మీపురం మీదుగా అమ్మవారి ఆలయానికి.. అక్కడ్నుంచి పంచమితీర్థం మండపానికి తీసుకొస్తారు. సారెలోని పసుపు, చందనం తదితరాలతో ఉత్సవమూర్తి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

ఇద్దరిపై పీడీ యాక్టు!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరిపై పీడీ యాక్టు నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివిధ నేరాలకు సంబంధించి తిరుపతి నగరం కొర్లగుంట మారుతినగర్‌కు చెందిన సయ్యద్ అజీమ్, పులిచెర్ల మండలవాసి, ప్రస్తుతం తిరుపతి నగరంలోని ఉద్యోగనగర్‌లో నివాసం ఉంటున్న వట్టికుంట అరుణ్‌కుమార్ అలియాస్ అరుణ్‌పై పీడీ యాక్టు నమోదుకు కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనికి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు ఎస్వీయూకు సెలవు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థం సందర్భంగా ఎస్వీయూకు మంగళవారం సెలవు ప్రకటించారు.

అరుణాచలానికి కార్తిక శోభ

● తిరువణ్ణామలైలో దీపోత్సవాలు ప్రారంభం


ధ్వజ పతాకాన్ని ఎగురవేస్తున్న శివాచార్యులు

వేలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్నిక్షేత్రంగా పేరుగాంచిన తిరువణ్ణామలైలో పది రోజులపాటు నిర్వహించనున్న కార్తిక దీపోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహనంతో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో కార్తిక దీపోత్సవాలకు ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలై క్షేత్రం మామిడి, అరటితోరణాల అలంకరణ, విద్యుద్దీపాల వెలుగుల్లో ప్రకాశిస్తోంది. ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, అన్నామలైయార్, ఉన్నాములై అమ్మవారు, చండికేశ్వర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నామలైయార్ సన్నిధి ముందు పంచమూర్తులను కొలుదీర్చిన శివాచార్యులు మేళతాళాలు, వేదమంత్రోచ్ఛారణ మధ్య ఉదయం 6.30 గంటలకు బంగారు ధ్వజస్తంభంలో కార్తిక దీపోత్సవం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ వైభవంలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, జిల్లా కలెక్టర్ దర్పగరాజ్, ఎస్పీ డాక్టర్ సుధాకర్, డీఆర్వో రామ్‌ప్రదీపన్, ఆలయ ధర్మకర్త మీనాక్షి సుందరం సహా సుమారు 10వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. సోమవారం ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు 10 రోజుల వరకు కొనసాగుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో పంచమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించనున్నారు. ఈ నెల 29వ తేదీ రాత్రి వెండి రథోత్సవం, 30వ తేదీ మహారథోత్సవాలను నిర్వహించనున్నారు. కార్తిక దీపోత్సవాల్లో ప్రధానాంశంగా మహాదీప దర్శన వేడుకలు డిసెంబరు 3న జరుగుతాయి. ఆ రోజు తెల్లవారు జామున 4గంటలకు అన్నామలై ఆలయంలో భరణిదీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దాదాపు 40 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశముంది.

భారీ భద్రతా ఏర్పాట్లు.

కార్తిక దీప దర్శన భద్రతా విధుల్లో సుమారు 15వేల మందికి పైగా పోలీసులు పాల్గొంటారని తిరువణ్ణామలై జిల్లా ఎస్పీ సుధాకర్ పేర్కొన్నారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ దర్పగరాజ్ తెలిపారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సమస్యలపై అధ్యయనానికి ప్రత్యేక బృందాలు : ఎస్పీడీసీఎల్ సీఎండీ



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'లో ఓల్టేజ్.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని వినియోగదారుల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం' అని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్కం పరిధిలోని 65 మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్షేత్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం జరుగుతోందని, అనతికాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామని ఆయన చెప్పారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చే చిన్న సమస్యలతో పాటు పెద్దవీ త్వరితగతిన పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సీజీఎంలు, జీఎంలు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైన సమస్యలు మినహా మిగిలినవి పరిష్కరించామన్నారు.వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333 కి డయల్ చేసి... 91333 31912 నెంబరుకు చాట్ చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

వినుత దంపతులే హతమార్చి ఉంటారు!

● రాయుడి సోదరి కీర్తిప్రియ ఆరోపణ



శ్రీకాళహస్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తన అన్న రాయుడు అలియాస్ శ్రీనివాసులును శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వినుత వాళ్లే హతమార్చి ఉంటారని కీర్తిప్రియ ఆరోపించారు. దీనిపై సోమవారం ఆమె వీడియో విడుదల చేశారు. 'వినుత వాళ్లే మా అన్న రాయుడిని హత్య చేసి ఉంటారని బలంగా అనుమానిస్తున్నా. ఎమ్మెల్యే సుధీర్‌పై వినుత దంపతుల ఆరోపణలకు ఎలాంటి పొంతన కుదరడం లేదు. ఎమ్మెల్యే పాత్ర నిజమైతే రాయుడిని చంపకుండా సాక్ష్యాలను బహిర్గతం చేసి ఉండొచ్చు. అలా కాకుండా అప్పుడప్పుడు వీడియోలను వదులుతూ ఆరోపణలు చేయడంపై అనుమానం కలుగుతోంది. ఎన్నో లక్షలు ఖర్చు పెట్టి రాయుడి వీడియోలను రికవరీ చేశామని వినుత వర్గం చెప్పుకోవడం ద్వారా.. వాళ్లే చనిపోయిన రాయుడు వీడియోలను సృష్టిస్తున్నారన్న అనుమానం వస్తోంది. ఈ హత్యకేసును లోతుగా దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి' అని ఆ వీడియోలో ఆమె కోరారు.

తిరుపతి రైల్వే స్టేషన్ పనులు

త్వరితగతిన పూర్తి చేయాలి

● సీపీఎం నేత మధు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం నేత,మాజీ ఎంపీ మధు డిమాండు చేశారు. తిరుపతిలోని తిరుపతిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అదానీ ప్రదేశ్‌గా ప్రభుత్వం మార్చేస్తోందని ఆరోపించారు. 'పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితరాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి ప్రభుత్వం తీవ్రనష్టం కలిగిస్తోంది. రాష్ట్రంలో రూ6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయక 60 డిగ్రీ కళాశాలలు మూత పడ్డాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న లోకేశ్ హామీ ఏమైంది? ఆరోగ్యశ్రీ పథకానికి రూ.మూడు వేల కోట్ల బకాయిలతో వైద్యం చేయలేమని ఆస్పత్రి యాజమాన్యాలు ప్రకటించాయి. విశాఖ స్టీల్ పక్కనే మరో ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వడానికి, ఎంపీలచే గనులు కేటాయించమని సీఎం చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగడం దేనికి సంకేతం?' అంటూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.


సీపీఎం నేతలతో మీడియా సమావేశంలో మధు

టీటీడీ అతిథి గృహ నిర్మాణం కోసం స్థల పరిశీలన



అతిథి గృహం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఆర్జేసీ, ఈవో

ఐరాల(కాణిపాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నుంచి మంజూరైన రూ.25 కోట్లతో కాణిపాక క్షేత్రంలో నిర్మించనున్న నూతన అతిథిగృహం, కల్యాణ మండపాల కోసం సోమవారం దేవదాయ శాఖ తిరుపతి ఆర్జేసీ చంద్రశేఖర్‌ఆజాద్, ఆలయ ఈవో పెంచలకిషోర్‌తో కలసి స్థల పరిశీలన చేశారు. లడ్డూ పోటు, పడితరం స్టోర్, అన్నదాన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో టీటీడీ నిధులతో వరసిద్ధుడి ఆలయం వద్ద అతిథి గృహం తదితర నిర్మాణాలను చేపడతామన్నారు. కల్యాణ మండపాలను అధునాతనంగా నిర్మించనున్నట్లు తెలియజేశారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, ధనంజయ, హరిమాధవరెడ్డి, ఇజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తమిళ కార్తీక సోమవారం పూజలు



మహానంది ముందు పిండి దీపాలు పెడుతున్న మహిళలు

ఐరాల(కాణిపాకం), నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో వెలసిన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో తమిళ కార్తీక సోమవారం పూజలను మహిళా భక్తులు వైభవంగా నిర్వహించారు.ఉదయం మహిళలు ఆలయానికి ఉపవాస దీక్షతో విచ్చేసి మణికంఠేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద, ఆలయంలోని మహానంది వద్ద భక్తులు పిండి దీపాలను వెలిగించారు. అనంతరం వారు ఆలయంలో ప్రసాదం స్వీకరించి ఉపవాస దీక్షను పూర్తి చేశారు. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షించారు.

ఎలక్ట్రానిక్స్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై 4.0) ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో మూడు నెలల పాటు ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపై విద్యార్హత కలిగి 18-40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలియజేశారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ కోర్సులో చేరాలనుకునే వారు 85003 84812 నెంబరును సంప్రదించాలని కోరారు.

రిటైర్డు జవాన్‌పై బైకర్ దాడి

బంగారుపాళ్యం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఆర్మీ జవాన్‌పై ఓ ద్విచక్రవాహనదారుడు రాయితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మొగిలి వెంకటగిరికి చెందిన చాన్‌బాషా కుమారుడు హర్షద్ తన బుల్లెట్ వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంతో నడుపుతూ వెళ్లాడు. గమనించిన రిటైర్డు ఆర్మీజవాన్ మురళీమోహన్ హర్షద్ ను ప్రశ్నించాడు. వీధిలో చిన్నపిల్లలు వెళుతుంటారు వేగంగా బండి నడిపితే ఎలా అని అడడంతో హర్షద్ ఆయనపై రాయితో దాడి చేశారు. దీనిపై మురళీమోహన్ భార్య ప్రియాంక స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. హర్షద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

5, 6, 7 తేదీల్లో గరికపాటి ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో డిసెంబరు 5, 6, 7 తేదీల్లో చిత్తూరు నారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకు డా.గరికపాటి నరసింహారావు ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం సంస్థ నిర్వాహకులు చిరంజీవి ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రీకాళహస్తీశ్వర శతకం ప్రవచనాలు నిర్వహిస్తారని భక్తులు విచ్చేయాలని కోరారు.

ఏకతా భావంతోనే దేశ ప్రగతి



కుప్పంలో జరిగిన యూనిటీ మార్చ్‌లో ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏకతా భావంతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు అన్నారు. కుప్పంలో సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని యూనిటీ మార్చ్ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్ భావజాలాన్ని ప్రజలందరూ నమ్మి ఆచరించాల్సిన సమయం ఇదేనన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఒకప్పటి నిజాం సంస్థానాన్ని సైనిక చర్యతో భారత్‌లో విలీనం చేసి, ఏకతా భావనకు బీజం వేశారని గుర్తు చేశారు. ఆ ఉక్కు మనిషికి నివాళిగా దేశ ప్రజలందరూ ఐక్యత, సంఘీభావం, జాతీయ సమగ్రత వంటి విలువలతో దేశ ప్రగతికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువతలో దేశభక్తి, బాధ్యత, ఐక్యతా విలువలు పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు ప్రేరణాత్మకంగా నిలుస్తాయని చెప్పారు. సర్దార్ కలలుగన్న ఐక్య భారత్ నీడలో దేశ ప్రజలందరూ చేయిచేయి కలిపి ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అన్నివర్గాల ప్రజలు జాతీయ జెండాలు ధరించి కుప్పం పట్టణ వీధుల్లో కదం తొక్కారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎస్.తులసీనాథ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

2 వేల దీపాలతో కార్తీక వెలుగులు



దీపోత్సవంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

పెనుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పెనుమూరు హెచ్ఎం రమేష్ ఆధ్వర్యంలో పాఠశాలలో 2 వేల దీపాలు వెలిగించారు. ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ప్రార్థనలు చేశారు. దీపాల వెలుగులో పాఠశాల ప్రాంగణం అలరారగా భక్తి వాతావరణం నెలకొంది. విద్యార్థులచేత 2 వేల దీపాలు వెలిగించారు. అనంతరం విశ్రాంత ఎంఈవో వరలక్ష్మి విద్యార్థులకు పెన్నులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, జిల్లా కార్యదర్శి తలారి రెడ్డెప్ప, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, పాఠశాల చైర్మన్ మునేంద్ర, గంగాధరం, అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 292 వినతులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

చిత్తూరు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాలు జరిగాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 292 మంది అర్జీదారులు హాజరయ్యారు. రెవెన్యూశాఖకు 194, డీఆర్‌డీఏకు 26, పోలీసు శాఖకు 10, వ్యవసాయశాఖకు 10, డీసీహెచ్ఎస్‌కు 9, డీపీవోకు 7, పంచాయతీరాజ్‌కు 6 శాఖకు 262 పోను ఎండోమెంట్,విద్య, ఉద్యాన, విద్యుత్, సివిల్ సప్లయిస్, ఎస్ఎస్ఏ, హౌసింగ్, మున్సిపాలిటీ, పశు సంవర్థక, ఉపాధి హామీ, ఐసీడీఎస్ శాఖలకు 30 అర్జీలు అందాయి. బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు వినతిపత్రాలను తీసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సాయినాథ్ బాధితుల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు.

బీసీ గణన చేపట్టండి

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీసీల కులగణన చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞాన జగదీశ్ కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో బీసీలకు దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలని కోరారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు

రోడ్డు వేయడాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐరాల మండలం ముదిగోళం పంచాయతీ గాజులపల్లె దళితులు ఫిర్యాదు చేశారు. తిరుపతి నుంచి కాణిపాకం వెళ్లేదారిలో తమ గాజులపల్లె గ్రామం ఉందన్నారు. మూడు నెలల కిందట రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు గుర్తు పెట్టారన్నారు. అయితే కొందరు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని తెలియజేశారు.

దారి సౌకర్యాన్ని కల్పించండి

వ్యవసాయ భూములకు దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం అడపాలబైలు గ్రామస్తులు కోరారు. సర్వే నెంబరు 213-1, 76-6, 76-4లో కొంత మందికి వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. దారి సౌకర్యం కల్పించాలని పలుమార్లు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలు ఇచ్చామన్నారు. సర్వేయర్, వీఆర్వోలు సర్వే చేసి దారి కోసం రాయి నాటి వెళ్లారన్నారు. గ్రామంలోని కొందరు ఆ దారిలో వెళ్లకుండా దారిని మూసివేసి జేసీబీతో గుంతలు తవ్వేశారని పేర్కొన్నారు.

పింఛన్ ఇప్పించండి

ఎనిమిది నెలల క్రితం తన భర్త చనిపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని చిత్తూరు రూరల్ మండలం చవటపల్లెకు చెందిన శృతి వాపోయింది. తనకు పింఛన్‌ను మంజూరు చేయాలని రెవెన్యూ, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. ఏడవ తరగతి వరకు చదువుకున్న తనకు పింఛన్‌తో పాటు ఏదైనా ఉపాధి అవకాశాన్ని కల్పించాలని కోరారు.

మా సాగులో భూమికి ఇతరుల పేరుతో పట్టా

తమ సాగులో ఉన్న భూమిని ఇతరులకు పట్టాలివ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని బైరెడ్డిపల్లె మండలం ఆకులకొత్తూరుకు చెందిన మోహన్‌బాబు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 962-3బిలో 2.52 ఎకరాల డీకేటీ భూమిని కోదండరెడ్డికి పట్టాలిచ్చారని తెలిపారు. ఆ భూమిలో రెవెన్యూ అధికారులు తమ అనుభవంలో ఉన్న 0.60 సెంట్ల భూమిని కలిపి పట్టాలిచ్చారన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ జేఏసీ చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, హెచ్ఆర్ పాలసీ వర్తింపు, ఉద్యోగ విరమణ వయస్సుపెంపు, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ఆలయాన్ని కట్టివ్వండన్న షికారీలు

పండగ వేళల్లో, అయ్యప్పమాల ధారణ చేసిన సమయంలో పూజలు చేసుకోవడానికి ఆలయం లేదని, ప్రభుత్వం స్పందించి ఓ ఆలయాన్ని నిర్మించాలని చిత్తూరు రూరల్ మండలం మాపాక్షికి చెందిన నక్కలోళ్లు కోరారు. మాపాక్షి గువ్వలకాలనీలో ఓ గుడిని నిర్మించి ఇవ్వాలని కోరారు.



బీసీల కులగణన గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఆ ముగ్గురి నుంచి కాపాడండి

పాలసముద్రం మండలం వనదుర్గాపురానికి చెందిన నవీన్‌నాయుడు (ఆర్మీ ఉద్యోగి); శరవణ కుమార్ (ఆంధ్రప్రభ కంట్రిబ్యూటర్), గురుప్రసాద్ (హ్యూమన్ రైట్స్ మెంబరు) బారినుంచి తనతో పాటు ఉద్యోగులను కాపాడాలని ఫీల్డ్ అసిస్టెంట్ సువర్ణ ప్రాధేయపడ్డారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా అసభ్యంగా, అమర్యాదగా మాట్లాడి వేధిస్తున్నారని వాపోయింది. రాత్రి సమయాల్లో వాట్సప్‌కాల్, వీడియోకాల్ చేస్తారని , ఫోన్ తీయకపోతే మరుసటి రోజు ఉపాధి పనుల్లో తప్పులు జరిగాయని ఆంధ్రప్రభలో రాస్తారన్నారు. కావాలనే ఎంపీడీవో, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లను టార్గెట్ చేసి వార్తలు రాస్తాడని తెలిపారు. ఈ ముగ్గురూ కలిసి వనదుర్గాపురం రోడ్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారని, ఆ దారిలో ఇసుక ట్రాక్టర్లు, లేదా కార్యాలయానికి కొంత ఆలస్యంగా వచ్చే ఉద్యోగులను బెదిరించి డబ్బులు తీసుకుంటారన్నారు. ఆ ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● పోలీసుశాఖ పీజీఆర్ఎస్‌కు 32 ఫిర్యాదులు



బాధితుల సమస్యలను వింటున్న డీఎస్పీ సాయినాథ్

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 32 మంది బాధితులు హాజరయ్యారు. బాధితుల నుంచి డీఎస్పీ సాయినాథ్ వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను విన్నారు. నిర్ణీత సమయంలోపు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి చీటింగ్ 1, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 3, భర్త వేధింపులు 1, భూతగాదాలు 10, డబ్బు తగాదాలు 10, చిన్న తగాదాలు 2, ఆస్తి తగాదాల కింద 2 వినతులు అందాయి.

మాతాశిశు మరణాలపై ఏం చేస్తున్నారు?

● వైద్యాధికారులపై డీఐవో ఆగ్రహం



మాతాశిశు మరణాలపై వైద్యాధికారులను విచారణ చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒక్క నెలలో 17 మాతాశిశు మరణాలు సంభవిస్తుంటే వైద్యాధికారులు ఏంచేస్తున్నారని పీహెచ్‌సీ వైద్యాధికారులపై డీఐవో హనుమంతరావు, కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా మాతాశిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అక్టోబరులో 1 మాతృ, 17 శిశు మరణాలు సంభవించడం గర్హనీయమన్నారు. ఇన్ని మరణాలు జరుగుతుంటే పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మరణాలకు గల కారణాలను పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారి, వైద్య సిబ్బందిని విచారించారు. ఈ మరణాలకు సంబంధింత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కూడా కారణంగా తెలుస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇకపై మరణాలు జరగకుండా ముందస్తుచర్యలు తీసుకోవాలని అన్నారు. ముందుగా హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్యాధికారులు నోడల్ అధికారి ఆదేశించారు. కాన్పు జరిగినప్పుడు బిడ్డకు వేయాల్సిన వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయించడం ద్వారా శిశు మరణాలకు అవకాశం ఉండదని తెలియజేశారు. ఈ సమావేశంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, గైనకాలజిస్టులు లత, అయేషా, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆలోచనలు రేకెత్తించే రచనలు ఉండాలి



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆలోచనలు రేకెత్తించే విధంగా రచనలు ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం కలెక్టరేట్‌లో పదో తరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సోషల్ స్టడీస్ స్టడీ మెటీరియల్ భౌగోళిక చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రం సమ్మిళితమై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ ఆదేశాలననుసరించి ఉన్నత విద్య, కేంద్ర విద్యాశాఖచే ఇండియన్ స్టాండర్డ్ బుక్ నెంబర్‌తో ఆమోదం పొందడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. వి.కోట జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) స్కూల్ అసిస్టెంట్ కె. స్వామికన్నన్‌చే రూపొందించి ఈ స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పేద విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, రచయిత స్వామికన్నన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ మంజూరు చేయాలి: యూటీఎఫ్



ఏపీసీ వెంకటరమణకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హతగల విద్యార్థులందరికీ ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ మంజూరు చేయాలని యూటీఎఫ్ నాయకులు సోమవారం సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ఒక కిలో మీటరు పైబడి దూరం, ఉన్నత పాఠశాలలకు మూడు కిలో మీటర్ల దూరం పైడిన ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో 50 శాతం మందికి ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ మంజూరు చేయలేదన్నారు. మనబడి మన భవిష్యత్తు ఫేజ్-2లో భాగంగా బడుల్లో అసంపూర్ణంగా ఉన్న భవనాలు పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలకు 50 శాతం స్కూల్ కాంపోజిట్ గ్రాంట్స్ విడుదల చేయాలని విన్నవించారు. అలాగే కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్‌కుమార్‌ను కలిసిన యూటీఎఫ్ నాయకులు మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసే బియ్యం ప్రస్తుతం క్లస్టర్ సెంటర్లలో దించుతున్నారని, అక్కడి నుంచి పాఠశాలలకు తీసుకువెళ్లడం ఇబ్బందికరంగా ఉందన్నారు. గతంలో లాగే డీలర్లు నేరుగా పాఠశాలలకు బియ్యం అందించేలా చర్యల తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, నాయకులు సుధాకర్, రెడ్డప్ప, రెహనాబేగం, ఏకాంబరం, సరిత, గణేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అంతర జిల్లా హాకీ క్రీడా పోటీలు



హాకీ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచిన కడప జిల్లా బాల, బాలికల జట్లు

చంద్రగిరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో గత మూడు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి హాకీ అండర్-14 పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్స్‌గా కడప జిల్లా బాల, బాలికల జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో విశాఖ జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు నిలిచింది. బాలుర ఫైనల్స్‌లో వైయస్సార్ కడప జట్టు, విశాఖ జట్టుపై 5-1 గోల్స్‌తో గెలిచి విన్నర్‌గా నిలిచి చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. విశాఖ జిల్లా జట్టు రన్నర్స్‌గా ద్వితీయ స్థానం ట్రోఫీ అందుకుంది. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో వైయస్సార్ కడప జట్టు, అనంతపురం జట్టుపై 4-1 గోల్స్‌తో గెలిచి చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. అనంతపురం జట్టు ద్వితీయ స్థానంతో రన్నర్స్‌గా నిలిచింది. అంతకు ముందు జరిగిన బాలుర మొదటి సెమీఫైనల్స్‌లో విశాఖ జట్టు 4-0 గోల్స్‌తో తూర్పుగోదావరి జట్టుపై విజయం సాధించి ఫైనల్స్ చేరుకుంది. మరొక సెమీఫైనల్స్‌లో బాలుర విభాగంలో వైయస్సార్ కడప జట్టు 5-0 గోల్స్‌తో అనంతపురం జట్టుపై గెలిచి ఫైనల్స్‌కు చేరింది. బాలికల మొదటి సెమీ ఫైనల్‌లో వైఎస్సార్ కడప జట్టు 7-0 గోల్స్‌తో విశాఖపట్నంపై గెలిచి ఫైనల్‌కు ప్రవేశించింది. బాలికల రెండవ సెమీఫైనల్స్‌లో అనంతపురం జట్టు 4-0 గోల్స్‌తో ఈస్ట్ గోదావరిని ఓడించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తరువాత నిర్వహించిన తృతీయ స్థానం పోటీల్లో బాలికల విభాగంలో విశాఖ జట్టు 2-1 గోల్స్‌తో ఈస్ట్ గోదావరి జట్టును ఓడించి, తృతీయ స్థానాన్ని నిలబెట్టుకుంది ఈస్ట్ గోదావరి జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. బాలుర తృతీయ స్థానానికి జరిగిన పోటీల్లో ఈస్ట్ గోదావరి జట్టు అనంతపురం జట్టుపై 3-0 గోల్స్ తేడాతో గెలిచి మూడో స్థానాన్ని పొందగా, నాలుగో స్థానంలో ఈస్ట్ గోదావరి జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయి జట్టుకు బాల బాలికల క్రీడాకారులను ఎంపిక చేశారు. క్రీడల ముగింపులో స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కిషోర్ భార్గవి, దేవి, అబ్జర్వర్ థామస్,ఆర్కే సెలవపాండెనే, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి కేశవయ్య, హరికృష్ణ, కిరణ్ కుమార్, ప్రభాకర్, జేమ్స్, చంద్రశేఖర్, శ్రీనివాసులుఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ మాస్టర్ దామోదరాచారికి పురస్కారం



యాదమరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదమరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి రాష్ట్రస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ కవితా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన రచించిన "భారతీయతను పొదుగుదాం" అనే కవితకు ఈ బహుమతి లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రెండురోజులపాటు జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ, మల్లెతీగ మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించాయి. ఈ రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో మొత్తం 408 కవితలు పోటీకి రాగా, వాటిలో కేవలం ఎనిమిది ఉత్తమ కవితలను ఎంపిక చేశారు. వాటిలో దామోదరాచారి కవిత ఒకటిగా నిలిచింది. ఈ సందర్భంగా దామోదరాచారిని సంస్థ నిర్వాహకులు దుశ్శాలువ, నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కొనసాగిన ఒంటరి ఏనుగు దాడులు



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన బోరు మోటారు పైపులు

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు మళ్లీ మొదలయ్యాయి. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలో మూడు రోజులుగా తిష్ఠ వేసిన ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. సోమవారం వేకువజామున ఒంటరి ఏనుగు తూర్పు విభాగం అటవీప్రాంతం పరిధిలోకి చేరుకుంది. ముందుగా గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కల్లూరు ఘాట్ రోడ్డు సమీపంలోని రిలయన్స్ సెల్ టవర్ వద్దకు చేరుకుంది. అక్కడ షాజహాన్, మౌలానా అజాద్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. అక్కడి నుంచి చిత్తూరు- కర్నూలు హైవేను దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతం పరిధిలోకి చేరుకుంది. కల్లూరులోని రైతు ఇమామ్‌కు చెందిన బోరు మోటారును కదిలించి పైపులను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. కోటపల్లిలోనూ పలు పంటలను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి కోటపల్లి మీదుగా అడవిలోని చింతలవంకకు చేరుకుంది.

కేడీసీ విద్యార్థుల విజయం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సాగర్ రాజ్ తదితరులు

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో అతిథ్య కళాశాల విద్యార్థులు అత్యధిక ఉద్యోగాలకు ఎంపికై సక్సెస్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. బంధన్ బ్యాంక్, ఎంఆర్ఎఫ్ (అరక్కోణం), జీఐ గ్రూప్, హోసూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ (మ్యాన్ పవర్ గ్రూప్), బెంగళూరు వేవా ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో కుప్పం డిగ్రీ కళాశాలకు చెందిన 238 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సాగర్‌రాజ్ మాట్లాడుతూ కళాశాలలో దశల వారీగా జరిగిన ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ కార్యక్రమాలు విద్యార్థుల విజయానికి దోహదం చేశాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పార్తిబన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాములగుట్టచేనులో సీఎం సందేశపత్రం అందిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం కంగుంది పంచాయతీ, రాములగుట్టచేను గ్రామంలో సోమవారం నిర్వహించిన 'రైతన్నా - మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశ పత్రాన్ని రైతులకు అందించారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రైతుల సమస్యలు, సాగులో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతుకూ ప్రభుత్వం తోడుగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు.

పరశురామేశ్వరుడి సేవలో పలమనేరు విద్యార్థులు



ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న పలమనేరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఏర్పేడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశు రామేశ్వరస్వామిని సోమవారం పలమనేరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు దర్శించుకున్నారు. సుమారు వందమంది విద్యార్థులు గుడిమల్లం ఆలయాన్ని సందర్శించి స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు.

వైకల్య గుర్తింపు శిబిరానికి స్పందన



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

వి.కోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వి.కోట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పలమనేరు నియోజక వర్గస్థాయిలో వికలాంగులు, వృద్ధుల కోసం సహాయక పరికరాల గుర్తింపు నిమిత్తం నిర్వహించిన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 3 వేల మందికి పైగా శిబిరానికి హాజరైనట్లు పలమనేరు ఆర్డీవో భవాని తెలిపారు. వీరిలో 965 మందికి సహాయక పరికారాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. పలమనేరు ఆర్డీవో భవాని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, ఎంపీడీవో రామచంద్రరావు, మండల టీడీపీ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, పీఏసీఎస్ అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి, నేతలు సుబ్బన్న, దీరజ్, శబరీష్, విశ్వనాథ్, వెంకట్రామప్ప, రాము, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు కందూరి నాగేశ్వర నాయుడు

చౌడేపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో మంగళవారం టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా వినతులు స్వీకరిస్తున్నామని పరిశీలకులు పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లె మండలంలో కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో వందల మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. అలాగే కొందరు నాయకులు కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారని. ఇకపై అలా జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అవినీతి నాయకులపై ఫిర్యాదు చేసినా స్వీకరిస్తామని. ప్రతి కార్యకర్తకు లోకేష్ అండగా ఉంటారని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగవద్గీతపై ఉచిత శిక్షణ

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్ర జ్యోతి) చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనలు పెంచాలనే ఉద్దేశంతో సామిరెడ్డి వీధిలో ప్రతి ఆదివారం ఉచితంగా భగవద్గీత, విష్ణు, లలిత సహస్రనామాలు బోధించనున్నట్లు నిర్వాహకులు రామమూర్తివర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నా మని ఆసక్తి గల తలిదండ్రులు తమ చిన్నారులను తీసుకు రావచ్చని వివరించారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు వినియోగించుకోండి



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ప్రజలను కోరారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డు మురుగన్ టాకీస్ రోడ్డులోని అంగన్‌వాడీ స్కూల్, 12వ వార్డు షికారీ కాలనీ స్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు ఈ ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ఫోన్‌నంబర్ లింక్, అడ్రస్, పేర్ల మార్పు వంటి వాటికి తగిన పత్రాలు సమర్పించి తమ ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ లావణ్య, సురేశ్, 11వ వార్డు కౌన్సిలర్ కస్తూరివేలు, 12వ వార్డు స్థానికక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడుపల్లెలో సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

కుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం దివ్యాంగులు, వృద్ధ పౌరుల కోసం సహాయ పరికరాల గుర్తింపు శిబిరం జరుగుతుందని కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. వాకింగ్ స్టిక్స్, లెగ్ స్టిక్స్, వీల్ చైర్లు, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, కుష్ఠు రోగులకు కిట్లు, డైసీ ప్లేయర్లు, కృత్రిమ అవయవాలు, అంధులకు టాకింగ్ వాచ్‌లు తదితర సహాయ ఉపకరణాల పంపిణీ కోసం అర్హులను శిబిరంలో గుర్తిస్తారన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధ పౌరులు యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్ తదితరాలు రెండు జిరాక్స్ ప్రతులు తీసుకు రావాలని పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

● **గుడుపల్లె:** గుడుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం వికలాంగ, వృద్ధులకు సహాయక పరికరాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు సీతారామ్ తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే వికలాంగులు యూడీఐడి కార్డు, ఆధార్ కార్డు, వైద్య సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రెండు జెరాక్స్ సెట్‌లు, పాస్‌ఫోర్టు సైజు ఫొటోలు నాలుగు, మొబైల్ నంబరు తీసుకొని రావాలన్నారు. వృద్ధులు 60 సంవత్సరాల లోపు ఉన్న వారు వైద్య సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం రెండు సెట్‌ల జిరాక్స్ కాపీలు తీసుకొని పాస్‌ఫోర్టు ఫొటోలు నాలుగు, మొబైల్ నంబరు తీసుకొని శిబిరానికి హాజరుకావాలని ఆయన కోరారు. శిబిరంలో సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి త్వరలో సంబంధిత పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

ఏనుగుల దాడులను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



రైతుకు నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న కామరాజనాయక్ తదితరులు

రామకుప్పం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రామకుప్పం అటవీప్రాంత పొలాలపై ఏనుగుల దాడులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్, రెస్కో డైరెక్టరు మనోహర్‌లు తెలిపారు. సోమవారం 89 పెద్దూరు గ్రామ సచివాలయంలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు వారు నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఏనుగులు అడవిని దాటి రాకుండా సరిహద్దుల్లో కందకాలు తవ్వించిందన్నారు. వైసీపీ పాలనలో వాటిని నిర్వహణను పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఏనుగులు యథేచ్ఛగా పొలాలు, తోటలపై దాడులు చేస్తున్నాయన్నారు. త్వరలోనే ఏనుగుల దాడులు నివారణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి పవన్ కళ్యాణ్, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి, మాజీ సర్పంచి రమేష్, మాజీ ఎంపీటీసీ చంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో జనసేన పటిష్టతకు కృషి



నినాదాలు చేస్తున్న నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు ఐకమత్యంగా ఉంటూ జనసేన పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని జనసేన నాయకుడు కోలా సోమశేఖర్ అన్నారు. సోమవారం పుంగనూరు తూర్పుమొగశాల వద్ద నియోజకవర్గ జనసేన పార్టీ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు. పుంగనూరు ఇన్‌చార్జి చిన్నారాయల్, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, సుబ్రహ్మణ్యం, పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

8 నుంచి 11 వరకు భజగోవింద ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో డిసెంబరు 8 నుంచి 11 తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధా మనోహర్ దాస్ ప్రవచనాలు నిర్వహించనున్నారు. చిత్తూరు నారాయణీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిసు_్తన్నామని, రోజూ సాయంత్రం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రామకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్ తెలిపారు. సోమవారం రామకుప్పం మండలం గడ్డూరు గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కార్యక్రమం తో గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా అధిక పెట్టుబడి సాయం అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. సబ్సిడీ ధరలకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పరికారాలు అందిస్తోందన్నారు. వ్యవసాయాధికారి అమృత, సిరికల్చర్ ఇన్‌స్పెక్టరు ఆనందప్ప, ఉద్యాన అధికారి డింపుప్రియ, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, రెస్కో డైరెక్టర్లు మనోహర్, సతీష్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు మండలంలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వం నుంచి వచ్చిన కరపత్రాలను రైతులకు అందజేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ సుజాత, మండల వ్యవసాయశాఖ అధికారిణి సంధ్య, పశుసంవర్ధక శాఖ డాక్టర్లు సతీష్, ధనుంజయ, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ఫిరోజ్, ఉద్యాన అధికారి మోనిక, మత్స్య శాఖ అధికారి పయని, మార్కెటింగ్ శాఖ అధికారి బాపూజీ, నయీమ్, టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, దేవా, జయప్రకాష్, టి.ఒడ్డూరు సర్పంచ్ మునస్వామి, బాలాజీనాయుడు,పెద్దబ్బ, రామచంద్ర, రాజేష్, బాబు, జగదీష్‌నాయుడు, వెంకటమునిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● **కల్లూరు :** పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. టీడీపీ నాయకులు నూర్‌భాషా, కరుణాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు అన్వర్‌బాషా, అష్రఫ్, ఖాదర్‌వల్లి, అబ్బాస్, ఉదయ్‌కుమార్, మునిరత్నం, సర్దార్‌బాషా, రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



గడ్డూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



పెంగరగుంట గ్రామంలో కరపత్రాలు అందిస్తున్న ఏవో సంధ్య

కాలువకు గండి

● నీట మునిగిన వరిపైరు



నీట మునిగిన వరిపైరు

రామకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చింతకుప్పం జిల్లాస్‌చెరువు మొరవ నుంచి వెళ్లే కాలువకు గండి పడటంతో జలాలు తన పొలంలోకి వచ్చి వరిపైరు నీట మునిగిపోయిందని రైతు రామచంద్ర తెలిపారు. హంద్రీ-నీవా జలాలతో నిండిన జిల్లాస్‌చెరువు ఇటీవల మొరవ ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మొరవ కాలువకు గండిపడిందని ఆయన తెలిపారు. దీంతో నీళ్లు తన పొలంలోకి వచ్చాయన్నారు. తన పొలంలోని ఎకరా విస్తీర్ణంలో గల వరిపైరు నీట మునిగి, తనకు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఈమేరకు తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, మండల వ్యవసాయాధికారికి ఆయన వినతి పత్రం అందజేశారు.

రైతన్నా-మీకోసంతో అన్నదాతకు ఆసరా

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా-మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతుల బతుకుల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 17 నెలల పాలనలో ఎన్డీయే ప్రభుత్వం అద్భుతమైన అభివృద్ధిని వేగవంతం చేస్తూ వ్యవసాయ రంగాన్ని నవశకంలోకి తీసుకెళ్లేందుకు పంచసూత్రాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మోసపూరిత పథకాలతో రైతులను నట్టేట ముంచి బిచ్చగాళ్లుగా మార్చిందన్నారు. జగన్ పాలనలో రైతులు ఆత్మహత్యలు పెరిగిపోయాయాని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆత్మస్థైర్యం నెలకొని ఆత్మహత్యలు తగ్గాయని పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు



కావలి గ్రీష్మకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

పెంగరగుంట పాఠశాలలో బాలల దినోత్సవం

పలమనేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం పెంగరగుంట ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.ఉమారాణి బాలల హక్కులు, బాలల సంరక్షణపై వరించడంతో పాటు బాలల దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.మాధవిలత, నజ్మా, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

పలమనేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ మీటింగ్ హాల్‌లో ఈనెల 25న మంగళవారం ఉదయం 11 గంటలకు సాధారణ, బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయం లో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

యుగంధర్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు



అవార్డు అందుకొంటున్న డాక్టర్ ఏటిగడ్డ యుగంధర్

పలమనేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ యుగంధర్ 67వ ఐఎంఏ వార్షిక మహాసభలో వరుసగా రెండోసారి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డుతో పాటు బెస్ట్ బ్రాంచ్ ఫెర్మార్మెన్స్ అవార్డు అందుకొన్నారు. రాజంపేటలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన మహాసభల్లో జాతీయ ఐఎంఏ అధ్యక్షులు దిలీప్ బనశాల్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యులు, స్నేహితులు డాక్టర్ యుగంధర్‌ను అభినందిస్తున్నారు. వైద్య విద్యకే పరిమితం కాకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద విద్యార్థులకు పుస్తకాలు, ఫీజుల చెల్లింపులకు నగదు సాయం చేస్తూ వారి ఉన్నతికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు రెండోసారి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఈ అవార్డులను అందజేయడం తనకు మరింత సామాజిక బాధ్యతను పెంచిందన్నారు. తాను పేదలకు మరింత సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ అవార్డులు తనకు ఒక బూస్టర్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ



బైరెడ్డిపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోందని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పేర్కొన్నారు. రైతన్నా - మీకోసం వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పాతూరునత్తంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పథకాలకు సంబంధించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, నాయకులు సుబ్రహ్మణ్యంగౌడు, నాగరాజు, మణిగౌండర్, శివకుమార్ పాల్గొన్నారు.

మబ్రూహుస్సేన్‌కు సన్మానం



పలమనేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో చిత్తూరు జిల్లా స్థాయి తరపున ఎంపికైన పలమనేరు జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మబ్రూహుస్సేన్‌ను సోమవారం సామాజిక కార్యకర్త మధుమోహన్ రావు సన్మానించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆలియాబేగం, అబ్దుల్ కలీం పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి



నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

పుంగనూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను పుంగనూరులో రెడ్డిసంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులో చౌడేపల్లె క్రాసు వద్ద గల ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

పుంగనూరు రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని లయన్స్‌క్లబ్ పుంగనూరు నోబుల్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక భవిత కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్ కె.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మొక్కలు నాటడం తో పర్యావరణాన్ని కాపాడటంతోపాటు రాబోవు కాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషంగా ఉండగలరన్నారు. కార్యక్రమంలో అమరావతి సురేశ్, వెంకటేష్, రాజేంద్ర, కృష్ణమూర్తి, కేశవరెడ్డి, రామకుమార్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకోసం తిరుమల యాత్ర



బంగారుపాళ్యం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నారా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని 2013 నుంచి ప్రతి సంవత్సరం నవంబరు మాసంలో తిరుమలకు తన అనుచరులతో కలిసి పాదయాత్ర చేస్తున్నట్లు శాంతిపురం టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో ఈ ఏడాది సోమవారం ఈ పాదయాత్ర బంగారుపాళ్యం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ చంద్రబాబు సీఎం కావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని మొక్కులు చెల్లించేందుకు తిరుమల వెళుతున్నామన్నారు. 12 సంవత్సరాలుగా తనతోపాటు 40 మంది అనుచరులతో తిరుమలకు కాలినడకన వెళుతున్నామని తెలిపారు. కాగా వీరికి వసతి, భోజన ఏర్పాట్లను రాగిమానుపెంటకు చెందిన సతీష్‌నాయుడు కల్పించారు.

రైతే రాజు కావాలన్నదే ప్రభుత్వ ఆశయం



కరపత్రాలు అందిస్తున్న ఎస్సీ జయప్రకాష్

బంగారుపాళ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతే రాజు కావాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల తెలుగుదేశం పార్టీ గౌరవ అధ్యక్షుడు ఎస్సీ జయప్రకాష్ అన్నారు. సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రైతు కుటుంబాన్ని ఉద్యానవన శాఖ అధికారులు సందర్శించారు. అంతకుముందు జంబువారిపల్లె, 170 గొల్లపల్లె, గుంతూరు, బంగారుపాళ్యం గ్రామాల్లో ఉద్యనవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి భారతి, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి సబ్సిడీలను వివరిస్తూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, జనార్దన్‌గౌడ్, సర్పంచు షీబా స్వామిదాస్, కోకా ప్రకాష్‌నాయుడు, క్రిష్ణకుమారి, రాధాక్రిష్ణమనాయుడు, సూరినాయుడు, గిరిబాబు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



చిత్తూరు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ నరసింహప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ప్రతి వినతిపత్రంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను ఇవ్వాలన్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, టిడ్కోలకు ఒక్కో అర్జీ వంతున మొత్తం ఐదు వినతులు అందాయి.

జగన్నాథపురం శివాలయంలో పూజలు

విజయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలోని శివాలయంలో తమిళనెల కార్తీక సోమవారం సందర్భంగా పూజలు నిర్వహించారు. శివునికి అభిషేకం నిర్వహించి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ని చేశారు. పురోహితులు రాంప్రసాద్‌శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

కోసలనగరంలో రైతన్నా మీకోసం

విజయపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం ఆఎస్‌కే ఆవరణంలో సోమవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఏవో రజినీకుమారి నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన రైతు భరోసా మంజూరు పత్రాలను జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు మునిభాస్కర్‌రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు సమరసింహారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎస్సీ ధరణీప్రసాద్



బంగారుపాళ్యం నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్సీ ధరణీప్రసాద్‌లు సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. కాణిపాకం తీర్థప్రసాదాలను ముఖ్యమంత్రికి అందజేశారు. బంగారుపాళ్యం మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని విన్నవించగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వీరితో పాటు కాణిపాకం ఆలయ చైర్మెన్ మణినాయుడు, ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబు నాయుడు తదితరులు ఉన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని ఒకరి మృతి

గంగాధరనెల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మరణించాడు. ఈ ఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముక్కలతూరు పంచాయతీ ముష్టిపల్లి గ్రామానికి చెందిన కోదండరెడ్డి(29) బంగారెడ్డిపల్లి సమీపంలోని కరెంటు ఆఫీస్ పక్కన మహదేవ మంగళం వ్యవసాయ క్షేత్రం వద్ద ఓ చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతుండగా స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

క్రీడల్లో నగరి డిగ్రీ కళాశాల అధ్యాపకుల ప్రతిభ

నగరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల, విశ్వ విద్యాలయ సిబ్బందికి జరిగిన క్రీడల్లో స్థానిక నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రతిభ కనబరచారని కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. త్రో బాల్ పోటీల్లో ఇందిరాప్రియదర్శిని, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అరుణ్ కుమారి రన్నర్‌గా నిలిచారు. టెన్నిస్ సింగిల్స్ విభాగంలో భాస్కర్‌రాజు విజేతగా నిలిచారు. సోమవారం కళాశాలలో అధ్యాపకులను అభినందించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : ఏఐటీయూసీ

నగరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు మురళి, శేఖర్ అధ్యక్షతన ఈ నిరసన చేపట్టారు.

ముఖ్యమంత్రితో భేటీ



ఐరాల(కాణిపాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపుహరిబాబునాయుడు కలిశారు. కాణిపాకం ట్రస్టు బోర్డుకు జీవో ఇవ్వడం ఆనందం అన్నారు.

భగవద్గీతపై ఉచిత శిక్షణ

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనలు పెంచాలనే ఉద్దేశంతో సామిరెడ్డి వీధిలో ప్రతి ఆదివారం ఉచితంగా భగవద్గీత, విష్ణు, లలిత సహస్రనామాలు బోధించనున్నట్లు నిర్వాహకులు రామమూర్తివర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహిం చనున్నామని ఆసక్తి గల తలిదండ్రులు తమ చిన్నారులను తీసుకు రావచ్చని వివరించారు.

8 నుంచి 11 వరకు భజగోవింద ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో డిసెంబరు 8 నుంచి 11 తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధా మనోహర్ దాస్ ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు నారాయణీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8-30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొండ మల్లీరుడికి పాలాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించారు.

● ఎగువ కన్నికాపురం వద్ద వెలసి ఉన్న మరకత వల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి పాలాభిషేకం చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

● చవటగుంటలోని మీనాక్షి సమేత అవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభి షేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్య వేక్షించారు.

సేవాభావంతో పనిచేయాలి

పాలసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవాభావంతో పనులు చేయాలని ఎంఈవో రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వెంగళ్రాజుకుప్పం జడ్పీ హైస్కూలులో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. మొక్కలు నాటించారు. ప్రిన్స్‌పాల్ హేమలత, హెచ్ఎం శ్రీహరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ షణ్ముగం పాల్గొన్నారు.

టీడీపీ కరపత్రాల పంపిణీ



పాలసముద్రం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు సోమవారం రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి.. రైతన్నా మీకోసం.. కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హులుగా ఉండి అన్నదాత సఖీభవ నగదు అందక పోతే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, టీడీపీ నాయకులు బాలాజీనాయుడు, అశోక్‌నాయుడు, ప్రభాకర్ నాయుడు, ధనరాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా ఆర్.జోబ్ నియామకం



చిత్తూరు కల్చరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటురూలో నిర్వహించిన ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా చిత్తూరు గిరింపేట షెకినా చర్చి పాస్టర్ రెవడెండ్ ఆర్ జోబ్ నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర పాస్టర్స్ పెడరేషన్ అధ్యక్షులు కె.ప్రభాకర్ రావు, సంయుక్త కార్యదర్శి జి.శ్యామూల్‌లు నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆర్ జోబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆర్.జోబ్‌ను నగరంలోని క్రైస్తవ ప్రతినిధులు అభినందించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద ఎంఎల్‌హెచ్‌పీ సుమాసాగరిని ప్రిన్సిపాల్ సత్కరించారు.

తాగునీటి ట్యాంకు సమస్య పరిష్కారం

వెదురుకుప్పం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం జక్కిదొనలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు సమస్యను వెదురుకుప్పం మండల ప్రత్యేక అధికారి శాంతారాజు సోమవారం పరిష్కరించారు. పైపులైను ఇళ్ల ముందు వెళ్లడానికి గ్రామస్తులు కొందు అభ్యంతరం తెలియజేశారు. ఈ వివాదం గురించి తెలుసుకుని ఉద్యోగులతో అక్కడికి వెళ్లి టీడీపీ నాయకుడు మాధవనాయుడుతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

● సెరికల్చర్, పశుసంవర్ధకశాఖ జేడీలు పద్మజ, ఉమామహేశ్వరి



రైతులతో మాట్లాడుతున్న సెరికాల్చర్, పశుసంవర్ధక శాఖ జేడీలు పద్మజా, ఉమామహేశ్వరి ఇతర అధికారులు

చిత్తూరు రూరల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సెరికల్చర్, పశుసంవర్ధకశాఖ జేడీలు పద్మజ, ఉమా మహేశ్వరి కోరారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లి గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెరికల్చర్ రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే వ్యవసాయం అని సూచించారు. ప్రభుత్వం మల్బరిసాగుకు ఇస్తున్న పలు సబ్సిడీలు, పథకాలు, శిక్షణ గురించి వివరించారు. పశుసంవర్ధక శాఖ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో గోకులం షెడ్లు, నీటి తొట్టెలు, పశుదాణ, పశుగ్రాసం విత్తనాలు, పశు బీమా అందిస్తుందని వివరించారు. అనంతరం ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ ఫిషరీస్ రవికుమార్, ఏడీ సెరికల్చర్ గీత రైతులు పాల్గొన్నారు. ● పాలూరు గ్రామంలో మాజీ సర్పంచ్ మోహన్‌రాజ్ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు హనుమంతనాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు



కావలి గ్రీష్మకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారిని ఏఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన సురాజ్

గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన గుడిపాల మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కృష్ణజిమ్మాపురం వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే పనులలో టిప్పరు అదుపుతప్పడంతో బీహార్‌కు చెందిన సురాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108లో 190 రామాపురం సీఎంసీకి తరలించారు. అలాగే నరహరిపేటక్రాస్ వద్ద జాతీయ రహదారిలో పశుమంద గ్రామానికి చెందిన సుబ్బానాయుడు తన గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వేలూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న కారుఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్రగాయమైంది. ఆయన్ను కూడా 190 రామాపురం సీఎంసీకి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుడిపాల గ్రామ పంచాయతీలో రైతన్నా మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉద్యాన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, ఏడీ ఉమా, మేయర్ అముద, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సీఎన్.రాజన్, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు, నాయకులు బాలాజీనాయుడు, హేమాద్రినాయుడు, సుమతి, ముత్తుప్రసాద్, శంకర్, రవినాయుడు, ధనసింగ్ పాల్గొన్నారు.

సదాశివేశ్వరుడికి విశేష పూజలు



అన్నదానం చేస్తున్న టీడీపీ నేత రాజేంద్రరెడ్డి

వెదురుకుప్పం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని శిష్ఠ సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వరస్వామికి సోమవారం విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఉభయదారుగా మేలపూడి మలర్ తులసిరెడ్డి, రాజ్ కుమార్, కార్తీక్ వ్యవహరించారు. మధ్యాహ్నం సుద్ధగుంటకు చెందిన నాగయ్య వితరణతో అన్నదానం జరిగింది. నిత్య నైవేద్యానికి దాతలు రేవతి, ప్రసాద్‌రెడ్డి దంపతులు బియ్యం అందజేశారు. రాజులకండ్రిగకు చెందిన ద్రాక్షాయణి, మార్కండేయరాజు ప్రదోష పూజకు నగదు రూ.5వేలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్‌రాజు, కార్యదర్శి మేలపూడి రాజేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు కృష్ణస్వామి, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



నింద్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షే మమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నింద్ర పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి తులసి, నాయకులు రమేష్, కుప్పా నాయుడు, భాస్కర్, పెరుమాళ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంశెట్టి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



గుడిపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రాపురంలో సీసీరోడ్డు నిర్మాణానికి సోమవారం టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్లహేమాద్రినాయుడు మాట్లాడుతూ రూ.15.5 లక్షల వ్యయంతో పనులను చేపట్టామ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేంద్రబాబు, ఎత్తిరాజులనాయుడు, కార్యదర్శి జమిల, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



పరిశుభ్రత పనులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నగరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు సోమవారం ఏకాంబరకుప్పం దళిత వాడలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి బ్రహ్మానందం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జి.మంజుల అధ్యక్షతన దళితవాడలో వలంటీర్లు పర్యటించారు. మరుగుదొడ్ల ప్రాముఖ్యత గురించి గ్రామ ప్రజలకు వివరించారు. వలంటీర్లు గ్రామంలో పలు శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపయ్య, అధ్యాపకులు సుదర్శనబాబు, ఉమా వాణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పత్రాల పంపిణీ



నగరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో గృహ నిర్మాణ మంజూరు పత్రాలను టీడీపీ నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 16, 21వ వార్డుకు చెందిన ప్రజలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 గృహ నిర్మాణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నటరాజ్, రామచంద్రన్, గోపి, నాగరాజ్, జగన్నాథం, బాలు, కందస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

పెనుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు అన్నారు. సోమవారం పెనుమూరు పంచాయతీ బీసీ కాలనీలో రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాల వివరాలు తెలియజేసే కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాసులు, ఏవో సుహర్‌లత, వెటర్నరీ డాక్టరు సుబ్రమణ్యం, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం : గాలి భానుప్రకాష్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలిచిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండలంలోని చిన్నతాంగేళ్ గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నామని తెలియజేశారు. క్రిమి సంహారక మందులను డ్రోన్ సాయంతో పిచికారి చేస్తే మంచిదని తెలియజేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గుడివీధికి తాగునీరు అందడం లేదని, పక్కా గృహాల మంజూరు పెన్షన్ల పంపిణీకి తమకు సాయం చేయాలని మహిళలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోనగరి వ్యవసాయ శాఖ ఏడీఏ కవిత, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, నగరి పీఏసీఎస్ అధ్యక్షులు బాలాజీ, టీడీపీ నాయకులు దయాల్‌రెడ్డి, కన్నివేల్‌రెడ్డి, గుణశేఖర్, వెంకటరత్నం యాదవ్, అల్లిముత్తు, సెల్వమణి, సుదర్శనం నాయుడు, కామేష్, మధు యాదవ్, సురేష్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటఅగ్రహారంలో రైతన్నా మీకోసం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొరబాబు

పూతలపట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటఅగ్రహారం పంచాయతీలో రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, గణపతినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి మధురవాణి, టీడీపీ నాయకులు, రైతులు, గ్రామస్తులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన విద్యుత్ ఉద్యోగి మృతి

పూతలపట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ ఉద్యోగి ఆదివారం రాత్రి మృతిచెందాడు. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన శివశంకర్ అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలంలోని ఓ విద్యుత్ సబ్ స్టేషన్‌లో జూనియర్ లైన్ మ్యాన్ (జేఎల్ఎం)గా విధులు నిర్వహించే వాడు. ఏడాదిన్నర క్రితం విధినిర్వహణలో ఉండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటినుంచి చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది గ్రామానికి చేరుకుని అతడి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంటింటికీ అధికారులు



రైతన్న మీకోసం కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిత్రానాయుడు

యాదమరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న 'రైతన్నా - మీకోసం' వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో హౌస్-టు-హౌస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రపల్లి, కీనాటంపల్లి, 12 కమ్మపల్లి గ్రామాల పరిధిలో రైతు కుటుంబాలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేంద్ర, ఏవో దీప, పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిత్రా నాయుడు, వల్లేరు అమరనాథ నాయుడు, గోపిగౌడ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పెనుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల వినియోగం తో జీవితాలు నాశనం అవుతాయని పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం మత్తు పదార్థాల వినియోగంపై జరిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని మంచి అలవాట్లకు కట్టుబడి ఉండాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని వివరించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి

బంగారుపాళ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మండలంలోని బొమ్మాయిపల్లె గ్రామానికి చెందిన 30 మంది తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు. అలాగే తుంబకుప్పం దళితవాడకు చెందిన 20 మంది లబ్ధిదారులకు త్వరలో ఇంటి పట్టాలు ఇవ్వనున్నామని తహసీల్దార్ షబ్బీర్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ బాబు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.